

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

దేవీ శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్లో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం చెరువులో వాటిని వదిలిపెట్టారు.


-న్యూస్‌టుడే, దేవరపల్లి

ఈనాడు తూర్పుగోదావరి

శుక్రవారం అక్టోబరు 11, 2024

దసరాకు.. ధరాఘాతం

కొనలేనంత భారంగా నిత్యావసరాలు, కూరగాయలు



ఈనాడు, కాకినాడ: దుష్ట సంహారం కోసం ఆదిశక్తి తొమ్మిది రూపాలు ధరించిందని పురాణాలు చెబుతున్నాయి. అన్నప్రసాదాలంటే అమ్మవారికి ప్రీతి.. అందుకే దసరా పర్వదినం వచ్చిందంటే ఆ సందడే వేరు. నవ రాత్రుల్లో ప్రతిరోజూ తొమ్మిది రకాల ప్రసాదాలు పెడుతున్నారు. ఇంకొందరు రోజుకో ప్రసాదంతో అమ్మకు నైవేద్యం అందిస్తారు. పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలతో శక్తి స్వరూపిణికి సమర్పించే నవ నైవేద్యాలకూ ధరాఘాతం తప్పడంలేదు. గత రెండేళ్లలో అన్నీ పెరిగాయి.


ఏరోజు ఏ నైవేద్యం పెట్టారంటే..

నవరాత్రుల్లో మొదటిరోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి బెల్లం పొంగలిని నైవేద్యంగా పెట్టారు. రెండోరోజు గాయత్రీదేవికి ఉడకబెట్టిన పెసలు, పెసరపప్పు పొంగలి, పులిహోర.. మూడోరోజు అన్నపూర్ణకు దద్దోజనం, పాయసన్నం, పొంగలి, కొబ్బరి అన్నం పెట్టారు. ప్రస్తుతం 8వ రోజు దుర్గాదేవిగా అలంకరించి పాయసం, చక్కెర పొంగలి పెట్టారు. శుక్రవారం మహిషాసుర మర్ధినిగా వడపప్పు, పానకం, పులిహోర, పాయసన్నం.. శనివారం రాజరాజేశ్వరీదేవికి పాయసన్నం, పులిహోర, కొబ్బరి, అరటి సమర్పిస్తారు. నైవేద్యానికి వాడే వస్తువులన్నింటి ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చొన్నాయి.

ఈ మూడేళ్లలో ప్రతి సెప్టెంబరులో ధరలిలా..

సరకు (కేజీ)	2022	2023	2024
బియ్యం గ్రేడ్-1	52.40	58.50	62.00
బియ్యం గ్రేడ్-2	37.98	40.21	41.30
గోధుమ	39.60	41.70	43.50
కందిపప్పు	120.00	170.94	172.28
పెసర పప్పు	101.20	116.70	117.75
మినప	101.30	112.90	121.75
శనగ	71.50	82.50	107.63
వేరుశనగ	32.60	39.60	34.00

(ఇవి కాకుండా పసుపు 2022 సెప్టెంబరులో కిలో రూ.225 ఉంటే 2023లో 243, ఇప్పుడు 260 ఉంది. కారం రెండేళ్ల క్రితం కిలో రూ.310 కాగా గతయేడాది సెప్టెంబరులో 361, ఇప్పుడు 380 ఉంది. బెల్లం గతంలో రూ.47.80 ఉండగా ఇప్పుడు రూ.53.50)



భారమైనా.. భక్తితో..

పండగల వేళ కృత్రిమ కొరతలు సృష్టించడం.. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడం సాధారణమైంది. కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలు భారమయ్యాయి. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల ధరలకు బోలెడు వ్యత్యాసం ఉంటోంది. కీలక శాఖలు ఆశించిన రీతిలో దృష్టిసారించడంలేదు. ఈ పరిస్థితి కట్టడిచేస్తే అన్ని వర్గాలకూ కాస్త వెసులుబాటు దక్కేవీలుంది.

413 మద్యం దుకాణాలు 7597 దరఖాస్తులు



ఆన్‌లైన్ చేసే విధానాన్ని తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ చైతన్యకుమార్

పిఠాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 413 మద్యం దుకాణాలకు 7,597 దరఖాస్తులు వచ్చాయి. పిఠాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్యకుమార్ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా, ఏ దుకాణానికైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని.. శుక్రవారం వరకు గడువు ఉందన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఈనెల 14న లాటరీ ఉంటుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రేణుక, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మౌనిక, పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివరామరాజు పాల్గొన్నారు.

విదేశాల నుంచీ..

మద్యం దుకాణాల కోసం విదేశాల నుంచీ దరఖాస్తులు వస్తున్నాయి. తునిలో 20 దరఖాస్తులు అమెరికా నుంచి వచ్చాయి. పలు ప్రాంతాల్లో యూరప్ నుంచీ అందాయి. వారంతా ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకునే వీలుండటంతో ఉన్నచోటు నుంచే నమోదు చేసుకున్నారు.

మంత్రి పట్టుకుంటారు.. వీరు మిన్నకుంటారు

▮ నాదెండ్ల తనిఖీల్లో వెలుగుచూస్తున్న రేషన్ అక్రమాలు ▮ సాధారణ రోజుల్లో సిబ్బంది పరిశీలన అంతంతే

ఈనాడు, రాజమహేంద్రవరం: రేషన్ దందా అడ్డగోలుగా సాగుతున్నా.. పేదల బియ్యం విదేశాలకు తరలించేస్తున్నా పట్టని రీతిలో యంత్రాంగం ఉంటోంది. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీల్లో అక్రమ బియ్యం పట్టుబడుతున్నాయి. స్థానిక సిబ్బందీ ఇదేమాదిరి దృష్టిపెట్టి ఉంటే అక్రమార్కులకు ఎప్పుడో కళ్లెం పడి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి నాదెండ్ల ఆ తర్వాత నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లోని నాలుగు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 96,270 కిలోల అక్రమ బియ్యం నిల్వలు గుర్తించారు. మరి సాధారణ రోజుల్లో సంబంధిత సిబ్బంది ఎందుకు వీటి జోలికి వెళ్లడంలేదన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఉదాశీనంగా వ్యవహరించడం వల్లే రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతోంది. మంత్రి మనోహర్ గత పర్యటనలోనూ కాకినాడ పోర్టులో ఇదే తరహాలో తనిఖీలు చేసి 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ నిల్వలు గుర్తించారు. అందులో దాదాపు 25 వేల క్వింటాళ్ల చౌక బియ్యం ఉన్నట్లు తేల్చారు.

జిల్లా	ఎండీయూలు	కార్డులు	సరఫరా చేసిన బియ్యం (కిలోలు)
తూర్పుగోదావరి	364	5,74,907	3,56,891
కాకినాడ	420	6,54,593	4,58,953
కోనసీమ	355	5,47,723	3,25,365

ఆఫ్రికా దేశాలకు..

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నల్లజర్ల-దేవరపల్లి మీదుగా చౌక బియ్యం లారీల్లో తరలుతున్నాయి. గతంలో విజిలెన్స్, ఇతర అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన బియ్యంపైనా సరైన నిఘా లేదు. దేవరపల్లిలోని వరలక్ష్మి మిల్లులో సీజ్ చేసిన 270 కిలోల రేషన్ బియ్యం ఉంచగా వాటిని దుర్వినియోగం చేసినా సిబ్బంది పట్టించుకోలేదు.



నల్లజర్లలో బుధవారం రాత్రి బియ్యం తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల

జిల్లాలో గుర్తించిన సీఎంఆర్ మిల్లుల్లో కొన్నేళ్లుగా సమర్థంగా తనిఖీలు లేవు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించేవారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన నిల్వలు, మిల్లింగ్ చేసి పంపిన బియ్యం, మిల్లు రోజువారీ కార్యకలాపాల రిజిస్టర్లు తనిఖీలు చేసేవారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఈతరహా తనిఖీలు మరుగునపడ్డాయి.

సొమ్ము ఇచ్చుకో.. పదోన్నతి పుచ్చుకో

▮ పంచాయతీ ఉద్యోగుల బదిలీల్లోనూ కాసుల వేట ▮ ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో వణుకు


ఈనాడు, కాకినాడ, రాజమహేంద్రవరం: జిల్లా, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో కొందరు ఉద్యోగుల లెక్కే వేరు. పదోన్నతులు, బదిలీలు, ఒప్పంద సిబ్బంది ఉత్తర్వులు, విచారణలు, అధికారుల పర్యటనలు ఇలా ఏ పని సాఫీగా సాగాలన్నా అడిగినంత సమర్పించాల్సిందే అన్నట్లుగా తయారైంది. తాజా పదోన్నతులు, బదిలీల్లో అక్రమ వసూళ్ల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. విచారణ జరిపించి నివేదికలు పంపాలని మూడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశించడంతో వ్యవహారం వేడెక్కింది.

వసూల్ రాజాలు ఎవరు..?

ఉమ్మడి జిల్లాలో గత నెలలో 55 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్- 2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించారు. ఒక్కొక్కరి దగ్గర్నుంచి రూ.18వేల చొప్పున వసూలు చేశారన్నది ఆరోపణ. గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 పదోన్నతులకు రూ.17వేల చొప్పున తీసుకున్నట్లు సమాచారం. ఆయా కార్యాలయాల్లో చక్రం తిప్పిన ఉద్యోగులు ఈ రేటు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ● కాకినాడ జిల్లాలో రాజకీయ వాసనతో ఉద్యోగం వెలగబెడుతున్న ఓ కీలక ఉద్యోగి.. ఏళ్లుగా పాతుకుపోయి ఇటీవల బదిలీ అయిన మరో ఉద్యోగి అక్రమ వసూళ్లలో చక్రం తిప్పారు.. కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చినా,



అడిగినంత ఇస్తేనే ఇక్కడి వ్యవహారం సాగిందనే వాదనలూ వినిపిస్తున్నాయి. .● తూర్పుగోదావరి జిల్లాలో కొందరు తమకు నచ్చిన స్థానాల్లో కొలువుకు పరస్పర అంగీకారం, నాయకుల సిఫార్సు లేఖలతో పైరవీలు చేశారు. కార్యదర్శుల బదిలీల్లో పెద్ద ప్రహసనమే సాగింది. ప్రత్యేక అధికారుల పాలన, స్థిరాస్తి వ్యాపారం దండిగా జరిగి, ఆదాయం వచ్చే పంచాయతీల్లో పాగా వేసేందుకు ప్రయత్నాలు సాగాయి. ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకుల సిఫార్సు లేఖలతో పైరవీలు సాగించారు. ఇటీవల ఓ ఎమ్మెల్యే తాను 57 లేఖలిస్తే మూడింటినే ఆమోదించారని పేర్కొనడంపై చర్చ నడుస్తోంది. ● కోనసీమలో అంతర్గత బదిలీలు 86, ఇతర జిల్లాల నుంచి 17 మంది వచ్చారు. వీరి బదిలీల్లోనూ సిఫార్సులు, ఆమ్యామ్యాలు పనిచేశాయి.



భరతమాత రత్నం

స్ఫూర్తిప్రదాత, అలుపెరుగని నిరంతర అన్వేషి రతన్ టాటాకు నివాళి అర్పిస్తూ రాజమహేంద్రవరానికి చెందిన చిత్రకారుడు హరి తాడోజు గీసిన చిత్రమిది. భరతమాత గుండెల్లో ఎప్పటికీ మీరు చిరంజీవే అని చెప్పేలా త్రైవర్ణ చిత్రం గీశారు.

-న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ఇసుక టెండర్ల ఖరారులో గందరగోళం

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ఓపెన్ ఇసుక రీచ్‌లకు టెండర్ల ఖరారు ప్రక్రియ గురువారం రాత్రి 11 గంటల వరకు కొనసాగుతూనే ఉంది. ఖరారైనవి వెల్లడించకుండా మరుసటి రోజు ప్రకటిస్తామని అధికారులు చెప్పడంతో కొందరు గుత్తేదారులు కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగినట్లు సమాచారం. జిల్లాలోని 17 ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి గురువారం జేసీ ఛాంబర్‌లో టెండర్లు ఖరారు ప్రక్రియ నిర్వహించారు. 16 ఓపెన్ రీచ్‌లకు టెండర్లు ఖరారు చేయగా ఒక దానిని ఆపినట్లు సమాచారం. మల్లేశ్వరం ఓపెన్ రీచ్ రెండు జిల్లాల పరిధిలో ఉండటమే దీనికి కారణమని చెబుతున్నారు. మిగతా రీచ్‌లకు టెండర్ల ఖరారు విషయంలో కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం సాయంత్రం 5 గంటలతో టెండర్ల దాఖలకు గడువు ముగియగా ఆ సమయానికి ముందే టెండర్లు దాఖలు చేయడానికి జేసీ ఛాంబర్‌కు వచ్చిన తమను కొందరు అడ్డుకున్నారని కాటవరానికి చెందిన వ్యక్తి ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అతనికి టెండర్ల దాఖలుకు అవకాశం కల్పించగా దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ జేసీ ఛాంబర్ వద్ద ఆందోళన చేసినట్లు తెలిసింది. దీంతో పాటు ఏ ఓపెన్ రీచ్ ఎవరికి ఖరారైనది వెల్లడించకుండా చివరకు అక్కడి నుంచి వెళ్లిపోమ్మని అంటున్నారని, టెండర్ల ఖరారు విషయంలో గోల్‌మాల్ జరిగే అవకాశం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేయడంతో జేసీ ఛాంబర్ వద్ద రాత్రి గందరగోళ పరిస్థితి నెలకొంది. దీనిపై జేసీని వివరణ అడిగేందుకు ఫోన్‌లో ప్రయత్నించినప్పటికీ ఆయన స్పందించలేదు.



జేసీ ఛాంబర్ బయట గుత్తేదారులు

‘టెలిగ్రామ్’ ద్వారా తెలుసుకుని..
క్రిప్టో కరెన్సీతో కొనుక్కుని..

మత్తు పదార్థాల వ్యవహారంలో నలుగురి అరెస్టు

న్యూస్‌టుడే, రాజానగరం

టెలిగ్రామ్ యాప్‌లో వచ్చే లింకుల ద్వారా మత్తు పదార్థాలు ఎక్కడ దొరుకుతాయో తెలుసుకున్నారు.. క్రిప్టో కరెన్సీని ఉపయోగించి వాటిని కొనుగోలు చేశారు. . దిల్లీ నుంచి తాడేపల్లిగూడేనికి వాటిని కొరియర్ ద్వారా తెప్పించుకుని నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో ఉపయోగించారు. సాధువుల వద్ద కొంత గంజాయిని, అక్రమంగా కర్ణాటక నుంచి తెచ్చిన మద్యాన్ని ఉపయోగించి జల్సా చేసుకున్నారు.. రాజానగరం నియోజక వర్గంలోని భూపాలపట్నంలో బుధవారం వెలుగుచూసిన డ్రగ్స్ వ్యవహారంలో బయటపడ్డ నిజాలివి. నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాజానగరం పోలీసుస్టేషన్‌లో కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ వివరాలు వెల్లడించారు. తాడేపల్లిగూడేనికి చెందిన దేవభక్తుని దినేష్ దివాన్‌చెరువులో ఉంటున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా భూపాలపట్నం సమీపంలో సిరాస్టుడియో స్పేస్ అతిథి గృహంలో మంగళవారం రాత్రి విందు ఏర్పాటుచేశారు. తాడేపల్లిగూడెం నుంచి మిత్రులు కొందరు కుటుంబాలతో హాజరయ్యారు. రాధా గగన్, దినేష్, పవన్‌కుమార్, పుష్పరాజ్, అజయ్ విడిగా పాల్గొన్నారు. దినేష్, పవన్‌కుమార్‌లకు ఎండీఎంఏ అనే డ్రగ్.. అజయ్, పుష్పరాజ్‌లకు గంజాయి తాగే అలవాటు ఉంది. సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా ఎండీఎంఏ డ్రగ్, గంజాయి ప్యాకెట్లు లభించడంతో నిందితులను విచారించారు. వీరిలో ఒకరు ఇంజినీరింగ్ విద్యార్థి అని డీఎస్పీ వివరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్, వెనుక వైపున నిందితులు

టెలిగ్రామ్‌ను ఇలా వాడేశారు..

రాధా గగన్ టెలిగ్రామ్ యాప్‌లో వచ్చే లింకుల ద్వారా డ్రగ్స్ అమ్మే వారి వివరాలు తెలుసుకుని.. రూ.32 వేలు విలువ చేసే క్రిప్టోకరెన్సీతో నాలుగు గ్రాముల ఎండీఎంఏను ఆన్‌లైన్‌లో బుక్ చేశాడు. కొరియర్ ద్వారా దిల్లీ నుంచి తాడేపల్లిగూడేనికి తెప్పించి దినేష్ పవన్‌లకు ఇచ్చి పార్టీలో పాల్గొన్నారు. అజయ్, పుష్పరాజ్ అన్నవరం రైల్వేస్టేషన్ సమీపంలోని సాధువుల వద్ద 50 గ్రాముల గంజాయిని తీసుకొచ్చి పార్టీకి హాజరయ్యారు. అంతా కలిసి కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయిదు మద్యం సీసాలు అక్రమంగా తెచ్చారు. పోలీసులు వీటన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న పవన్‌కుమార్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.24 లక్షలు దోచేశారు..

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.24.50 లక్షలు దోచుకున్న ఘటనపై రాజమహేంద్రవరం మూడో పట్టణ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేశారు. సీఐ వి.అప్పారావు వివరాల మేరకు.. జయకృష్ణపురానికి చెందిన ఎం.నీరూప్‌కుమార్ వాట్సాప్ నంబరుకు ఈ ఏడాది మార్చిలో కేపిటల్ ఇన్‌కమ్ బిల్డర్స్ అనే సంస్థకు సంబంధించిన గ్రూప్‌లో కలవాల్సిందిగా ఓ సందేశం రావడంతో అతడు యాడ్ అయ్యాడు. సంస్థ ట్రేడింగ్‌లో నగదు పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చునని ఆగంతకులు నమ్మబలికారు. వారి మాయమాటలు నమ్మిన నీరూప్ ఏప్రిల్ 23న రూ.50 వేలు పెట్టుబడి పెట్టాడు. వచ్చిన షేర్స్‌ను తిరిగి లాభాల్లో పెట్టాలని మరో రూ.20 లక్షలు, వచ్చిన లాభాలను తీసుకోవాలంటే పన్ను కట్టాలని రూ.4 లక్షలు.. ఇలా పలు దఫాలుగా లాగేశారు. అనుమానం వచ్చి ప్రశ్నిస్తే.. అతడిని గ్రూప్‌లో బ్లాక్ చేసి ఎటువంటి సమాచారం ఇవ్వకపోయేసరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ధరల నియంత్రణకు చర్యలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: నిత్యావసర సరకుల ధరల నియంత్రణలో భాగంగా జిల్లాలోని అన్ని హోల్‌సేల్, రిటైల్ దుకాణాల వద్ద ధరల పట్టికలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జేసీ చిన్నరాముడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వంటనూనెకు సంబంధించి రైతుబజార్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుతోపాటు హోల్‌సేల్, రిటైల్ డీలర్లు వద్ద బహిరంగ మార్కెట్ కంటే తగ్గించి విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని అధికారులను జేసీ ఆదేశించారు.

విశిష్ట వైద్యుడు ఇక్కడివారే

ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ మృతితో తల్లడిల్లిన ఆప్తులు



స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేణుగోపాల్‌కు సత్కారం (పాతచిత్రం)

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రెండు రోజుల క్రితం మృతిచెందిన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(ఎయిమ్స్) మాజీ డైరెక్టర్ డాక్టర్ పాణింగిపల్లి వేణుగోపాల్ స్వస్థలం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లానే. దేశంలోనే మొదటిసారి గుండె మార్పిడి శస్త్రచికిత్స చేసిన వైద్యుడిగా తనదైన ముద్ర వేసిన ఆయన రాజమహేంద్రవరంలోనే పుట్టారు. ప్రస్తుతం ఆ నివాసంలో ఆయన పెద్ద సోదరి ఉంటున్నారు. ఇటీవల వచ్చి ఆమెను పలకరించి వెళ్లారని, ఇంతలో మరణవార్త వినాల్సి వచ్చిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

పౌర సన్మానం... వేణుగోపాల్ వైద్య సేవలను మెచ్చి 2003లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో ఆయనకు పౌర సన్మానం జరిగింది. ఆ తర్వాత ఆనం కళాకేంద్రంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. డాక్టర్ వేణుగోపాల్ వందలాది మంది నిరుపేదలకు ఉచిత వైద్య సలహాలు, శస్త్ర చికిత్సలు అందించారు.

● పాణింగిపల్లి సత్యనారాయణ, లక్ష్మీనరసమ్మ దంపతులకు మొత్తం పది మంది బిడ్డలు. తొమ్మిదో సంతానం వేణుగోపాల్ రాజమహేంద్రవరంలోనే జన్మించారు. సత్యనారాయణ సొంత ఊరు పి.గన్నవరం మండలం పోతుకోటి గ్రామం. ఎల్ఐసీలో ఉద్యోగ రీత్యా ఆయన రాజమహేంద్రవరంలో స్థిరపడ్డారు. కోటిపల్లి బస్టాండ్ నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జికి వెళ్లే మార్గంలో సొంత గృహం ఉంది. వేణుగోపాల్ పాఠశాల విద్య రాజమహేంద్రవరంలోనే సాగింది. దిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి స్వర్ణ పతకం అందుకున్నారు. ఎయిమ్స్ దిల్లీలో బోధకుడిగా చేరిన ఆయన డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. వేణుగోపాల్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన అందించిన వైద్య సేవలకు గాను పద్మభూషణ్, బీసీ రాయ్ తదితర ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. వేణుగోపాల్ పెద్ద అన్నయ్య విశ్వనాథం మద్రాసు ప్రభుత్వంలో జలవనరుల శాఖ విభాగంలో చీఫ్ ఇంజినీరుగా పని చేశారు. అప్పట్లో 14 డిగ్రీలు చదివిన వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన ఇంజినీరింగ్ సేవలకు ఇండియన్ గోల్డ్ పురస్కారం పొందారు. వేణుగోపాల్ సోదరీమణులు కొందరు రాజమహేంద్రవరంలో మహిళా కళాశాల, ఎవీఏ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయగా, ఒకరు ప్రభుత్వ విజయశంకర నృత్య కళాశాలలో అధ్యాపకురాలిగా సేవలందించారు. ప్రస్తుతం ఓ సోదరి మాత్రమే నగరంలో ఉన్నారు. ఇన్నీసుపేట, గాంధీపురం-2లో కూడా వీరికి నివాసాలున్నాయి.

రతన్ టాటాకు కడియంతో అనుబంధం

● ఇక్కడి బేరింగ్‌టోనియా మొక్కలంటే చాలా ఇష్టం
● నర్సరీ రైతు బిడ్డ మార్గాని వెంకటశేషుతో ప్రత్యేక మైత్రి

న్యూస్‌టుడే, కడియం

రతన్‌టాటాకు తూర్పు గోదావరి జిల్లా కడియపు లంక నర్సరీలతో విడదీయరాని అనుబంధం ఉంది. ఇక్కడి మొక్కలను ఆయన తన గ్రూప్ సంస్థ కార్యాలయాలతో పాటు.. తన నివాసంలోనూ విరివిగా ఏర్పాటు చేసుకున్నారు. అందులోనూ బేరింగ్‌టోనియా మొక్కలంటే టాటాకు చాలా ఇష్టమని కడియం నర్సరీల రైతులు చెబుతున్నారు. ఇక్కడి నర్సరీ రైతు మార్గాని వీరబాబు 2023 జనవరిలో కుటుంబంతో సహా వెళ్లి రతన్‌టాటాను ఆయన నివాసంలో కలిశారు. మాట్లాడటానికి గంట అనుమతి కోరగా ఆ మేరకు అనుమతించారు. అయితే, వీరబాబు ప్రయాణించిన విమానం ల్యాండింగ్ వైఫల్యంతో రెండున్నర గంటలు ఆలస్యంగా అక్కడికి వెళ్లారు. ఆ విషయాన్ని మాధ్యమాల ద్వారా తెలుసుకున్న రతన్ టాటా.. తన కోసం ఎంతో ప్రయాసపడి వస్తున్న వారి ఇబ్బందిని తెలుసుకుని మరో గంట సమయాన్ని వీరబాబు కుటుంబం కోసం కేటాయించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం, వాటి పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. తదితరాలను అడిగి తెలుసుకున్నారు. కడియం నర్సరీలో బేరింగ్‌టోనియా మొక్కపై తన మక్కువను రతన్ టాటా వారికి వివరించారు. అలాంటి గొప్ప వ్యక్తి మృతి ప్రపంచానికి తీరని లోటని వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు.



రతన్ టాటాతో మార్గాని వీరబాబు కుటుంబం

● **మార్గాని వెంకటశేషుతోనూ ప్రత్యేక మైత్రి:** వీరబాబు కుమారుడు మార్గాని వెంకట శేషుకు రతన్ టాటాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన అభిరుచులకు అనుగుణంగా పర్యావరణ, ప్రకృతి, పశు పక్ష్యాదులకు సంబంధించిన అంశాలతో కొన్ని కొటేషన్లు తయారు చేసి టాటా వ్యక్తిగత ఈమెయిల్‌కు 2017 నుంచి పంపిస్తుండేవారు వెంకట శేషు. వాటిల్లో కొన్ని రతన్‌టాటాకు నచ్చడం.. ఆయన తిరిగి జవాబు ఇవ్వడం ప్రారంభించడంతో ఇద్దరి మధ్య మైత్రి మొదలైంది. ఆ క్రమంలోనే తన పుట్టిన రోజున తల్లిదండ్రులతో వెళ్లి టాటాను కలిసిన శేషు.. తాను గీసిన చిత్రాలను ఆయనకు బహూకరించారు. మొత్తం మూడుసార్లు రతన్‌టాటాను కలిసే అదృష్టం తనకు కలిగిందని.. తాను బహూకరించిన చిత్రాన్ని తదేకంగా చూసి సంతోషపడ్డారని వెంకట శేషు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. చిత్రాన్ని గీయడానికి గల ప్రేరణ ఏంటనేది టాటా తనను అడిగి తెలుసుకున్నారని.. ఆయనకు డ్రైఫ్రూట్ లడ్డూలంటే చాలా ఇష్టమని వివరించారు. తానూ పలు సందర్భాల్లో ఆయనకు లడ్డూలు పంపించినట్లు వెంకటశేషు వివరించారు. ఈ ఏడాది జనవరిలో తాను కలిసినప్పుడు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. అనంతరం అనారోగ్యానికి గురవడంతో కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడానని.. చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన లేని లోటు తీరదని బాధ వ్యక్తం చేశారు.



వెంకటశేషు గీసిన చిత్రంపై ఆటోగ్రాఫ్ ఇస్తున్న రతన్‌టాటా

కరెన్సీ నోట్లలో కనకదుర్గమ్మ



దేవీ నవరాత్రులు సందర్భంగా పెరవలి మండలం ఖండవల్లి శివారు గవ్వలపాలెంలోని కనకదుర్గమ్మ వారిని గురువారం రూ.3 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

\- న్యూస్‌టుడే, పెరవలి

కనువిందు చేసిన కోటసత్తెమ్మ



దుర్గాష్టమి సందర్భంగా గురువారం నిడదవోలులోని కోటసత్తెమ్మ అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి తరలివచ్చారు.

\- న్యూస్‌టుడే, నిడదవోలు

పాపికొండలు యాత్రలో జాగ్రత్తలు పాటించాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గండిపోచమ్మ, పోచవరం పాయింట్ల నుంచి పేరంటాలపల్లి వరకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ నిర్వహిస్తున్న బోటింగ్ కార్యకలాపాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.స్వామినాయుడు సూచించారు. పాపికొండలు విహార యాత్ర విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పర్యాటకశాఖ అధికారులు, ప్రైవేటు బోటు ఓనర్లతో రాజమహేంద్రవరంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రైవేటు బోటు ఆపరేటరు బోటుకు సంబంధించి పర్యాటకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం, ఇరిగేషన్ శాఖ నుంచి రూట్ పర్మిషన్, మారిటైం బోర్డు నుంచి బోటు లైసెన్స్ పొంది ఉండాలన్నారు. ప్రతి బోటులో లైఫ్ సేవింగ్, ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉండాలన్నారు. గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్లరాదని ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. ప్రయాణికుల చిరునామా, మొబైల్ నంబరుతో పూర్తి వివరాలు నమోదు చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు. పరిమితికి మించి సందర్శకులను అనుమతించరాదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలుంటాయని సిబ్బందిని హెచ్చరించారు. ప్రైవేటు బోటులో పనిచేసే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. లైసెన్స్ పొందిన డ్రైవర్లు మాత్రమే బోట్లు నడపాలన్నారు.

కోరుకొండంత పర్యాటక శోభ

పుణ్యక్షేత్రాల సందర్శనతో సంతరించుకోనున్న వైభవం



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం

న్యూస్‌టుడే, కోరుకొండ

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రం పర్యాటక శోభను సంతరించుకోనుంది. రాష్ట్ర పర్యాటక శాఖ దీనిపై దృష్టి సారించింది. ఇప్పటికే పలు అంశాలతో ఉన్నతాధికారులకు నివేదిక వెళ్లింది. అధికారికంగా అనుమతి వచ్చాక స్వామివారి ఆలయం పర్యాటక ప్రాంతాల జాబితాలో చేరనుంది.

గత ప్రచారం... ఇప్పుడు ఆచరణలోకి

గత వైకాపా ప్రభుత్వ హయాంలో కోరుకొండ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారని ప్రచారం జరిగింది. సమీపంలోని బౌద్ధ క్షేత్రమైన కాపవరం పాండవుల మెట్ట నుంచి కోరుకొండ లక్ష్మీనరసింస్వామివారి కొండ వరకు రోప్‌వే ఏర్పాటుకు పలుసార్లు సర్వేలు జరిగాయి. ఆ తరువాత అది అమలుకు నోచుకోలేదు. స్వామివారికి రెండో మెట్ల మార్గం నిర్మాణంపై చర్చలు జరిగినా అదీ అమలు కాలేదు.

పుణ్యక్షేత్రాల సరసన

తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని పలు ప్రధాన దేవాలయాలను కలుపుతూ పర్యాటకంగా ఒక ప్యాకేజీని ప్రకటించనున్నారు. ఇందులో ప్రధానంగా అన్నవరం, అంతర్వేది వంటి సుమారు 10 ఆలయాలను కలుపుతూ రూట్ మ్యాప్ రూపుదిద్దుకుంటోంది. ఆ జాబితాలోనే కోరుకొండ ఆలయాన్నీ పుణ్యక్షేత్రాల సందర్శన సరసన చేర్చారు.

అన్నదానం... ప్రత్యేక ప్యాకేజీ

పర్యాటకులకు ఇక్కడ ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు అన్నదానం కాంప్లెక్సు ఏర్పాటు చేసేందుకు నివేదిక రూపొందించారు. పర్యాటక ప్యాకేజీలో భాగంగా అన్నదానం సమయానికి ఇక్కడికి చేరేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతాల జాబితాలో చేర్చాం



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నాం. చుట్టు పక్కల ప్రధాన ఆలయాలతో కలిపి ఇక్కడా పర్యాటకులు సందర్శించేలా కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

\- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే

పార్టీకి జవసత్వాలు తెచ్చేందుకు చర్యలు తీసుకోండి

మాజీ ఎంపీ హర్షకుమార్ లేఖ

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ అధిష్ఠానానికి లేఖ రాశారు. హైదరాబాద్, బెంగళూరులో నివసించేవారిని రాష్ట్ర అధ్యక్షులుగా నియమిస్తున్నారని అందులో పేర్కొన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ బలం పుంజుకోవడానికి పార్టీ అధిష్ఠానం సరైన నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ఇటీవల షర్మిలారెడ్డి నియమించిన కమిటీ చూశాక రాష్ట్రం పట్ల అవగాహన లేదని అర్థమవుతోందన్నారు. తెలంగాణ, ఆంధ్రలో పార్టీకి రెడ్ల నాయకత్వం తప్పితే ఇంకెవరూ కనపడరనే ఆలోచనలోంచి కాంగ్రెస్ బయటకు రావాలని అభిప్రాయపడ్డారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో శతాబ్ది ఉత్సవాలు

సీతానగరం: కస్తూర్బాగాంధీ ఆశ్రమం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమాన్ని గురువారం ఆయన సందర్శించి శతాబ్ది ఉత్సవాలపై ఆశ్రమం ప్రతినిధి జి.సుశీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్ర కలిగిన గాంధీ ఆశ్రమంలో శతాబ్ది ఉత్సవాలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆహ్వానిస్తామన్నారు. మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి గాంధీ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరిస్తామన్నారు. కాగా గతంలో చంద్రబాబు రెండు సార్లు బాపూకుటీరం వద్దనే బసచేశారని ప్రతినిధి సుశీల ఎమ్మెల్యేకు వివరించారు. 1997లో చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాల్లో ఇచ్చిన అభివృద్ధి నిధుల వల్లే ఇంకా ఆశ్రమం చరిత్ర మిగిలి ఉందన్నారు. శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వానించే సమయంలో అయ్యే ఖర్చంతా తానే భరిస్తానని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బొంగు రాజారావు, డాక్టర్ సత్యం రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఏపీ ఆర్‌సెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు

తిరుపతి (బైరాగిపట్టెడ): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్ 2023-24లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు సెట్ ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలోని 17 వర్సిటీల్లో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సుల్లో 2,566 పీహెచ్‌డీ ఖాళీలకుగాను తొలిదశలో ఫుల్‌టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1,237 మందికి సీట్ల కేటాయింపు చేపట్టినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో రిపోర్టు చేశాక సంబంధిత విశ్వవిద్యాలయాల్లో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు నేరుగా హాజరు కావాలని కోరారు.

సీజ్ చేసిన మిల్లులో.. చౌక బియ్యం నిల్వల లెక్కింపు



తూకం వేసిన బియ్యాన్ని గోనె సంచుల్లో పడుతున్న హమాలీలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్, నల్లజర్ల: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు నల్లజర్లలోని శ్రీవెంకట సత్య సాయి రైసు మిల్లులో చౌకబియ్యం నిల్వల లెక్కింపు గురువారం ప్రారంభించారు. ఈ మిల్లులో మంత్రి మనోహర్ బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించి పెద్ద మొత్తంలో చౌక బియ్యం నిల్వలున్నట్లు గుర్తించిన విషయం తెలిసిందే. తూకం వేసిన 45,600 కిలోల చౌక బియ్యాన్ని 50 కిలోల చొప్పున 912 బస్తాల్లో నింపినట్లు ఆమె తెలిపారు. ఇంకా తూకం వేయవాల్సిన బియ్యం చాలా ఉన్నాయని, పూర్తయిన తర్వాత వాటిని అనంతపల్లిలోని ఒక రైసుమిల్లుకు తరలిస్తామని తెలిపారు.

కేసుల నమోదు: నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో మూడు రైసు మిల్లుల్లో అక్రమ నిల్వలు గుర్తించడంతో సంబంధిత మిల్లర్లపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. నల్లజర్లలోని మద్దు సత్యనారాయణమూర్తికి చెందిన వెంకటసత్య రైస్ అండ్ ఫ్లోర్ మిల్లులో రూ.36.40 లక్షల విలువైన 80 వేల కేజీల పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించగా, దేవరపల్లిలో సి.హెచ్.అప్పారావుకు చెందిన వరలక్ష్మి రైస్‌మిల్లులో గతంలో సీజ్ చేసిన రూ.12,285 విలువ చేసే 270 కేజీల బియ్యాన్ని అకౌంట్‌లో చూపించకుండా దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించినట్లు జేసీ తెలిపారు. అదే గ్రామంలో సి.హెచ్.హరిబాబుకు చెందిన వెంకటేశ్వర రైస్ మిల్లులో 16 వేల కేజీల పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు జేసీ తెలిపారు.

'ఇసుక టెండర్లలో అక్రమాలు అరికట్టాలి'

దేవీచౌక్(రాజమహేంద్రవరం): ఇసుక టెండర్ల గడువు పొడిగించి, అక్రమాలు అరికట్టాలని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఒక ప్రకటనలో అధికారులను కోరారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమాల్లో పాలుపంచుకున్న గుత్తేదారులు ప్రస్తుత టెండర్లలోనూ పాల్గొని గుత్తాధిపత్యం చెలాయించడం కనిపిస్తోందన్నారు. కొంతమంది గుత్తేదారులు జేసీ ఛాంబర్‌లో కూర్చొని టెండర్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. వీరిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేవలం సీనరేజ్, రవాణా ఖర్చులతో ఉచితంగా ఇసుక అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యానికి వీరి చర్యలు తూట్లు పొడిచేలా ఉన్నాయన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)



దేవీచౌక్: టమాట-48/42, వంకాయలు(నలుపు-36/గులాబీ-44/తెలుపు-38/దొమ్మేరు-46), బెండ-40, కాకర-36, బీర(పందిరి-46/42), దొండ-34, క్యారెట్-40, బీట్‌రూట్-34, గోరుచిక్కుళ్లు-40, దోస-36, ఆనబకాయ-35/40, చిక్కుళ్లు-90/దేశవాళీ-100, పచ్చిమిర్చి-22, బంగాళదుంపలు-33, ఉల్లిపాయలు-50/కొత్తవి-34.

రాజమహేంద్రవరం

సినిమాలు దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక: విశ్వం, స్వామి, అనుశ్రీ: స్వాగ్, సూర్యమినీ: జిగ్రా, రంభ: మా నాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు).

టెట్‌కు 1093 మంది హాజరు

శ్యామలాసెంటర్: లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రం వద్ద గురువారం ఉదయం జరిగిన టెట్ పరీక్షకు 240 మందికి గాను 218 మంది, మధ్యాహ్నం పరీక్షకు 961 మందికి గాను 875 మంది హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు తెలిపారు.





బాపిరాజు గీసిన దుర్గామాత రూపాలు

లోకమాతకు చిత్రాంజలి



పుప్పాల బాపిరాజు

రాజమహేంద్రవరం సాంస్కృతికం : మహిషాసురుడిని వధించి లోక కల్యాణం చేసిన దుర్గామాతకు రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పుప్పాల బాపిరాజు చిత్రాలతో అంజలి సమర్పించారు. సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్దని, లలితాదేవి, బాలదుర్గలను విభిన్న రూపాల్లో భక్తితో చిత్రించారు.

దుష్ట భయంకరీ.. దుర్గాదేవి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: దుష్టశక్తులను వధించి లోక కల్యాణాన్ని అందించిన జగన్మాత శ్రీదుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రధాన కేంద్రమైన దేవీచౌక్‌లో గురువారం శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి హారతి అందించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి శ్రీదుర్గాదేవి అవతారంలో అలంకరించి సంపెంగ, చామంతి పూలతో నవదుర్గాదేవి పూజ చేశారు. పాయసం నైవేద్యంగా సమర్పించి సీతాఫలం దానమిచ్చారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, భవానీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దేవీచౌక్‌లో నేడు

అలంకరణ: మహిషాసుర మర్ధని

సాంస్కృతిక కార్యక్రమాలు:

రాత్రి 10 గంటల నుంచి బాలనాగమ్మ, శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం నాటకాల ప్రదర్శన



మార్కండేయస్వామి ఆలయంలో దుర్గాదేవిగా..

- శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా గురువారం అమ్మవారి ఉత్సవమూర్తికి శ్రీదుర్గాదేవి అవతారంలో అలంకరించి సహస్రనామ పారాయణం పఠించారు.

- వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ఖర్జూరంతో అలంకరించి కుంకుమార్చన చేశారు.



వాసవీ మాత ఖర్జూరంతో అలంకరణ



దేవీచౌక్‌లో అమ్మవారికి దుర్గాదేవిగా అలంకరణ

- వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మీ ఆలయంలో ధనలక్ష్మీ అమ్మవారికి పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు.



అమ్మవారి ప్రతిమ



అందమైన హారం



అమ్మవారికి అలంకరించే కిరీటం

అమ్మను అలంకరిద్దామా..

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

దసరా వస్తోందంటే అంతటా ఆధ్యాత్మిక సందడే. ప్రతి ఇంటా పదిరోజులు అమ్మను పలు రూపాల్లో అలంకరించి పూజిస్తారు. ప్రత్యేకించి దసరా రోజు అమ్మవారి రూపునకు పలు రకాల ఆభరణాలు అలంకరించి వేడుక జరుపుతారు.

ఈ సామగ్రి విక్రయాలతో నగర మార్కెట్ కళకళలాడుతోంది. మెయిన్ రోడ్డులోని పలు దుకాణాల్లో రోల్‌గోల్డ్ ఆభరణాలు విక్రయిస్తున్నారు. అమ్మవారిని అలంకరించేందుకు రాళ్లతో తయారైన అందమైన ఆభరణాలు కనువిందు చేస్తున్నాయి. అమ్మవారి మూర్తి రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు వివిధ ధరల్లో లభిస్తున్నాయి. వీటితో పాటు హారాలు, కిరీటాలు వంటివి విక్రయిస్తున్నారు.

ప్రార్థన మందిర నిర్మాణానికి సాయం

టి.నగర్, న్యూస్‌టుడే: శాటిలైట్ సిటీ 'సి' బ్లాక్ బాపూజీనగర్‌లో జీసస్ పవర్ ప్రేయర్ హౌస్ చర్చి నిర్మాణానికి గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నివాసంలో చర్చి నిర్వాహకులు బిషప్ రమేష్ కుమార్‌కు ఆర్థిక సహాయం అందజేశారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులు

ఘనంగా నిరాశ్రయుల దినోత్సవం

కోటగుమ్మం, న్యూస్‌టుడే: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా పట్టణ నిరాశ్రయుల కేంద్రం, మెప్మా, స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవ శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిరాశ్రయులకు ఉచితంగా కాస్మొటిక్స్, దుస్తులు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు.. రైళ్లలో పండగ రద్దీ

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: దసరా పండగ రద్దీ నేపథ్యంలో ఇటు ఆర్టీసీలో, అటు రైల్వేలో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాయి. హైదరాబాద్ నుంచి తొమ్మిది ప్రత్యేక బస్సుల్లో, వివిధ ప్రాంతాల నుంచి రెండు ప్రత్యేక రైళ్లలో ప్రయాణికులు గురువారం జిల్లాకు వచ్చారు. జిల్లా మీదుగా కాకినాడ టౌన్-సికింద్రాబాద్, విజయవాడ-శ్రీకాకుళం ప్రత్యేక రైళ్లు నడిచినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం అన్ని రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసి నడుస్తున్నాయి.

హైదరాబాద్ నుంచి నేడు పది బస్సులు

జిల్లాలోని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోనకు నాలుగు, కొవ్వూరు డిపోనకు మూడు, గోకవరం, నిడదవోలు డిపోలకు రెండు హైదరాబాద్ ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణికులు వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ప్రయాణికుల రద్దీ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున దానికనుగుణంగా ప్రత్యేక, అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. గురువారం రాత్రి జిల్లాలోని నాలుగు డిపోల నుంచి మరో 10 ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌కు పంపించారు. ఇవి శుక్రవారం అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని అదే రోజు రాత్రికి ఆయా డిపోలకు చేరుకుంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాజమహేంద్రవరం నుంచి విశాఖకు గురువారం మూడు అదనపు బస్సులు తిప్పారు.

రైళ్ల ఆలస్యంతో తప్పని నిరీక్షణ

కొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పడంలేదు. బొకారో ఎక్స్‌ప్రెస్ రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు గురువారం గంటన్నర ఆలస్యంగా వచ్చింది. ఉదయం 7.58 గంటలకు రావాల్సిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3.15 గంటలకు వచ్చింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా రూట్లలో నడిచే కొన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులు ఆలస్యంగానే నడుస్తున్నాయి. కొన్ని రూట్లలో ట్రాఫిక్ జామ్, రోడ్లు బాగోకపోవడం వంటివి దీనికి కారణంగా అధికారులు చెబుతున్నారు.



రైల్వేస్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అన్ని వసతులతో ఆధునిక కబేళా

టి.నగర్, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంపై దృష్టి సారించడం జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆవ రోడ్డులో నిర్మించిన మేకల, గొర్రెల కబేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, ఆధునిక విధానంలో శ్లాటర్ హౌస్‌ను నిర్మించడం జరిగింది. వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అక్కడే జరిగిన మటన్ మర్చంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభలో ఆయన పాల్గొన్నారు.



కబేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి వరకు అన్నదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో విజయదశమి పర్వదినం నుంచి అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని శ్రీధర్మశాస్త్రా ఆధ్యాత్మిక సంస్థ ధర్మకర్తలు జక్కంపూడి విజయలక్ష్మి, చల్లా శంకరరావు, పొలసానపల్లి హనుమంతరావు తెలిపారు. ఆలయం వద్ద గురువారం విలేకరుల సమావేశంలో జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా మాదిరిగానే అన్నదాన కార్యక్రమం సంక్రాంతి వరకు కొనసాగుతుందన్నారు. అయ్యప్ప మాలధారులతోపాటు భవానీ, శివ మాల ధరించిన భక్తులకు భోజనం అందిస్తామన్నారు. మాలధారణ చేసేవారికి శివాలయం ఇక్కడ లేదని తెలిసి వాయులింగాన్ని ప్రతిష్ఠ చేశామన్నారు. చల్లా శంకరరావు మాట్లాడుతూ గతేడాది లక్షానలభై వేలమందికి భోజనం అందించగా ఈ ఏడాది అదే అంచనాతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా చాపరాల రామచంద్రరావు పేరిట ఆయన కుటుంబ సభ్యులు రూ.65 వేల విరాళం అన్నదానం కోసం అందజేశారు. మంతెన కేశవరావు, తోట సుబ్బారావు, ఇమంది మోహనరావు, దవులూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.మధు చెప్పారు. నగరంలోని అపరాల సెక్షన్ కార్యాలయంలో సీపీఐ శాఖ సమావేశం సత్తిబాబు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ నగరంలోని ఆయా డివిజన్లలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరపాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? ఇలా ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు

83282 39927, 80089 02897

ఏవీఏ రోడ్డు.. ఏవీ వసతులు

న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

అంతర్గత దారుల్లో అవస్థ... సరిగాలేని పలకలు, ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్.. ఎక్కడికక్కడ వదిలేసిన నిర్మాణ వ్యర్థాలు.. ఇదీ నగరంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఒకటి అయిన ఆనాల వెంకట(ఏవీ) అప్పారావు రోడ్డులో పరిస్థితి. ఏవీ అప్పారావు రోడ్డు నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ప్రయాణం ప్రమాద భరితంగా ఉంది. నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో మూడు కూడళ్లున్నాయి. వీటి వద్ద వేగ నియంత్రికలు(స్పీడు బ్రేకర్లు) లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురు వీధిలో అంతర్గత రహదారి చాలావరకు దెబ్బతింది.



దారుల్లో ఇదీ పరిస్థితి



శ్రీనివాసనగర్ మలుపులో...

పలకలు విరిగినా

ఈ ప్రాంతంలో పలుచోట్ల దారుల్లో విరిగిన పలకలు, ఇనుప గ్రిల్స్ చుట్టూ ఏర్పడిన రంధ్రాలు వాహన చోదకులు, పాదచారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. శ్రీనివాస నగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు మలుపులో ఉన్న మ్యాన్‌హోల్‌పై పలకలు లేకపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. నిత్యం పిల్లలతో రద్దీగా ఉండే లారెట్ కిడ్స్ పాఠశాల వద్ద రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ పలక విరిగిపోయింది. వేంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర్లో జాతీయ రహదారి మార్గంలో రోడ్డు మధ్యన ఉన్న ఇనుప గ్రిల్ చుట్టూ రంధ్రం ఏర్పడింది.



రోడ్డు పక్కనే వ్యర్థాలు

జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించి మార్గంలో రోడ్డు వెంబడి కొంతమేర నిర్మాణ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కాలువ వద్ద ఇనుప ఊచలు ప్రమాదకరంగా మారాయి.

స.హ.చట్టంతో పారదర్శకత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంతోనే విధి నిర్వహణలో పారదర్శకత సాధ్యమని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి కె.విజయ కుమారి పేర్కొన్నారు. కందుకూరి స్త్రీ సదనంలో గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ ఆధ్వర్యంలో సహ చట్టం 19వ వార్షికోత్సవ వేడుక గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయ కుమారి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంతోనే హక్కులు పొందవచ్చన్నారు. విధుల్లో జవాబుదారీతనం వహించిన కొందరు అంగన్‌వాడీ సిబ్బందిని గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ ప్రతినిధులు సత్కరించారు. ఇదే వేదికపై కొంత మూరు షణ్ముఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పామర్తి నాగరాజు ఆధ్వర్యంలో భవానీపురానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు సాయికుమార్‌కు వీల్ ఛైర్ బహూకరించారు. విశ్రాంత న్యాయమూర్తి వెంపటి విశ్వనాథం, గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శిశు సంక్షేమ అధికారిణి విజయ కుమారి

ప్రమాదకరంగా పలకలు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నారాయణపురం వాటర్ ట్యాంకుల రహదారి మలుపులో రోడ్డు మధ్యన పూర్తిగా పాడైపోయిన స్థితిలో పలక ప్రమాదకరంగా కనిపిస్తోంది. వాహనాలు ప్రయాణం కొనసాగితే విరిగిపోయే ప్రమాదముంది. ప్రధాన ప్రాంతం కావడంతో నిత్యం పాదచారులు, వాహన చోదకులు సంచరించే ప్రాంతం. రాత్రి సమయంలో ఎవరైనా అప్రమత్తంగా లేకుంటే ప్రమాదానికి గురికావాల్సి వస్తుంది. అధికారులు స్పందించి నూతన పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: మల్లయ్యపేటకు చెందిన పి.సత్యప్రభాకర్ ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి స్థానిక పెట్రోల్ బంకు కూడలి దాటుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని..

హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఎం.వెంకటనాయుడు ద్విచక్ర వాహనంపై గురువారం ఆటోనగర్ జాతీయ రహదారి కూడలి దాటుతుండగా కారు ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు గాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

అల్కట్‌తోట ప్రాంతానికి చెందిన ఓ బాలిక(14) ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి గురువారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా విక్రేత అరెస్టు

తాడితోట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎన్.ప్రేమ్‌రాజ్ స్థానికంగా సారా విక్రయిస్తుండగా గురువారం ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విభాగిని దిమ్మ.. ఇలా ఇంకెన్నాళ్లు?

నగరంలోని చౌడేశ్వరీనగర్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో డివైడర్ సిమెంటు దిమ్మ ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో డివైడర్ దిమ్మ రోడ్డుపై పడిపోయి ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో ద్విచక్ర వాహనచోదకులు దీనిని గమనించకపోవడం వల్ల ఢీకొని కింద పడిపోయి గాయాలపాలవుతున్నారని చెబుతున్నారు. గత కొన్నిరోజులుగా డివైడర్ దిమ్మ ఇలా రోడ్డుపై పడిపోయి ఉన్నా సంబంధిత సిబ్బంది దానిని అక్కడి నుంచి తొలగించడానికి లేదా సరి చేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం



అధ్వాన రహదారులపై అవస్థలు

రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం ప్రాంతంలో పలు వీధుల్లోని రహదారులు గుంతలమయంగా మారి.. రాకపోకల సమయంలో వాహనచోదకుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఇదొకటి. పాఠశాలలు, ఆసుపత్రులతో రద్దీగా ఉంటుంది. ఇటువంటి చోట్ల రహదారులు అధ్వానంగా తయారవడంతో తరచూ ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. వర్షం కురిసినప్పుడే నీరు గుంతల్లో నిలిచిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాలు దెబ్బతింటున్నాయని చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు



తవ్వేసి.. నిర్లక్ష్యంగా ఇలా వదిలేసి..



రాజమహేంద్రవరంలోని పేపరుమిల్లు రోడ్డు శ్రీరామ్‌నగర్‌లో ప్రధాన మార్గంలో తాగునీటి పైపులైను మరమ్మతుల కోసమని రోడ్డు పక్కన కొన్ని రోజుల కిందట గుంత తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ మరమ్మతులు చేయకుండా, తీసిన గుంతను పూడ్చకుండా రోజుల తరబడి అలాగే వదిలేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. ఇక్కడి పైపులైను చాలా కాలం నుంచి లీకై నీరు వృథాగా రోడ్డు వెంబడి ప్రవహించడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ సంబంధిత విభాగం సిబ్బంది ఇటీవల ఇక్కడి వచ్చి భూమిలోంచి ఉన్న పైపులైను మరమ్మతుల కోసమని గుంత తవ్వారు. రోజులు గడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో తీసిన గుంతలో నీరు నిలిచిపోయి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)

దేవిచౌక్: టమాట-48/42, వంకాయలు(నలుపు-36/గులాబీ-44/తెలుపు-38/దొమ్మేరు-46), బెండ-40, కాకర-36, బీర(సందిర-46/42), దొండ-34, క్యారెట్-40, బీట్‌రూట్-34, గోరుచిక్కుడు-40, దోస-36, ఆనపకాయ-35/40, చిక్కుడు-90/దేశవాళీ-100, పచ్చిమిర్చి-22, బంగాళదుంప-33, ఉల్లిపాయలు-50/కొత్తవి-34.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్రకాష్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక్: విశ్వం, స్వామి, అనుశ్రీ: స్వాగ్, సూర్యమినీ: జిగ్రా, రంభ: మా నాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్(రెండేసి ఆటలు), వీమాస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు).

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ఆకు కూరలు తీసుకోవాలి



కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

రంగంపేట: ఆకు కూరలు తప్పనిసరిగా తీసుకోవడంతో కంటికి ఆరోగ్యం నెలకొంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి వేణుశ్రీలక్ష్మి తెలిపారు. గురువారం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దృష్టి, మానసిక ఆరోగ్య దినోత్సవాలను వైద్య సిబ్బంది నిర్వహించారు. కళ్ల సంరక్షణ, మానసిక ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సంకీర్తన వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రహదారిపై గుంతలు పూడ్చండి



సమస్య: రాజానగరం-కలవచర్ల వెళ్లే మార్గంలో రహదారిలో గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చండి.

- కె.రామచంద్రరావు, కలవచర్ల

సమాధానం: ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

- టి.వి.సుబ్బారావు, ఈఈ(ఆర్‌), రాజానగరం - న్యూస్‌టుడే, రాజానగరం

మురుగుతో ఇబ్బందులు

సమస్య: స్థానిక నీలాద్రినగర్, సంజీవ కాలనీ, లక్ష్మీ నరసింహనగర్ ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో రహదారులపైకి చేరుతుంది. రాపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - వెంకటరామయ్య, స్థానికుడు

సమాధానం: ఆ ప్రాంతాల్లో మురుగుకాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.

- వెంకటరావు, పంచాయతీకార్యదర్శి, ధవళేశ్వరం - న్యూస్‌టుడే, ధవళేశ్వరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

ఆర్డీఓకు వినతి

కోటగుమ్మం: జి.యర్రంపాలేనికి చెందిన దివ్యాంగుడు పెదపాటి గోపాలకృష్ణ తనకు కేటాయించిన రేషన్ దుకాణం నిర్వహణపై ఆర్డీఓ ఆర్ కృష్ణ నాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తనకు కేటాయించిన దుకాణం విషయంలో న్యాయం చేయాలన్నారు.

చౌక దుకాణాలకు కందిపప్పు

పండగ రోజు నుంచి పంపిణీకి ఏర్పాట్లు

బిక్కవోలు, న్యూస్‌టుడే: రెండేళ్లుగా గత వైకాపా ప్రభుత్వం విస్మరించిన పప్పన్నాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి తినిపించనుంది. దసరా పర్వదినాన చౌక దుకాణాల్లో కందిపప్పు సరఫరాకు సిద్ధమవుతుంది. ఇప్పటికే అన్ని స్టాక్ పాయింట్లకు కందిపప్పు ప్యాకెట్లు వచ్చి చేరాయి. అది వినియోగదారుల వద్దకు వెళ్లడమే తరువాయి. వైకాపా హయాంలో చౌకదర దుకాణం అంటే కేవలం బియ్యానికి పరిమితమయ్యింది. తమ అధికారంలో నాణ్యతగా పంచదార, పప్పులు పంపిణీ చేశారు. గోధుమలు సైతం పంపిణీ చేస్తామంటూ అప్పటి ప్రభుత్వం ప్రకటించినా ఆచరించడంలో అలసత్వం చూపింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల బాధలను అర్థం చేసుకుని పంచదార, కందిపప్పు పంపిణీకి చర్యలు చేపట్టింది.

ఒక్కో కార్డుకు కిలో..

ఒక్కో కార్డుపైన కిలో కందిపప్పు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. బయట దుకాణాల్లో కిలో కందిపప్పు దాదాపు రూ. 140 ధర పలుకుతుండగా, చౌక దుకాణాల ద్వారా రూ. 67కే అందిస్తోంది. దీంతో ఎప్పుడు కందిపప్పు ఇస్తారా అని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. అయితే ప్రస్తుతం పప్పు 40 శాతం మాత్రమే వచ్చింది. మిగిలిన పప్పు రావాల్సి ఉంది. దీనిపై డీలర్లు ఇంకా డబ్బు చెల్లించకపోవడమే కారణంగా తెలుస్తోంది. డబ్బు చెల్లిస్తే పప్పు అందివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బియ్యం, పంచదార సరఫరా చేసాం. వచ్చేనెలలో కందిపప్పు సరఫరా చేస్తామని డీలర్లు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	వచ్చిన పప్పు (కిలోలు)	కార్డులు
అనపర్తి	7,800	22,277
బిక్కవోలు	7,850	22,952
రంగంపేట	6,900	20,201



మండలాల స్టాక్ పాయింటుకు చేరిన రేషన్ కందిపప్పు ప్యాకెట్లు

చాలాకాలం అయ్యింది..



రేషన్ షాపుల ద్వారా కందిపప్పు వచ్చి చాలాకాలం అయ్యింది. మార్కెట్‌లో కందిపప్పు కొనాలంటే పేదలు కొనలేక పోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం చౌకగా కందిపప్పు సరఫరా చేయించడం చాలా సంతోషం. పండగపూటయినా పేదలు పప్పన్నం తింటారు.

- లక్ష్మి, కొంకుదురు

నాణ్యమైందిగా చెబుతున్నారు..



స్టాకు పాయింట్‌కు వచ్చిన కందిపప్పు నాణ్యమైందిగా ఉందని చెబుతున్నారు. బయట మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ. 150 వరకు పలుకుతోంది. ఆ ధరకు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులు అధిగమించేలా పండగలోపు ఇస్తే సంతోషం.

- మంగయమ్మ, కొప్పవరం

దసరాకి సరఫరా చేయిస్తాం..

డీలర్లు అందరితో నగదు జమచేయిస్తున్నాం. ఇప్పటికే అనపర్తి మండలం చాలా వరకు పూర్తయ్యింది. బిక్కవోలు మండల డీలర్ల నుంచి కూడా నగదు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దసరా నాడు కందిపప్పు వినియోగదారులకు అందిస్తాం. అందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఆన్‌లైన్ మరో రెండు రోజులు తెరచి ఉంచేందుకు సన్నద్ధంగా ఉన్నాం.

- ప్రసాద్, ఎంఎస్‌వో, అనపర్తి

సింహ వాహిని.. అభయప్రదాయిని

శరన్నవరాత్రుల్లో భాగంగా లోకనాయకి ఎనిమిదో రోజు దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. జగన్మాతను అష్టచేతులతో సింహ వాహనంపై రాజసంగా అలంకరించడంతో భక్తులు ప్రణవిల్లారు. మహిళలు విశేష కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

బొమ్మూరు: స్థానిక నేతాజీనగర్‌లో అమ్మవారు దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. పువ్వులు, ప్రత్యేక ఆభరణాలతో అమ్మను అలంకరించారు. మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. భక్తులు అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు.

కడియం: విజయవాడలో ఇంద్రకీలాద్రి వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు వన ప్రసాద వితరణ నిర్వహించారు. కడియపులంక గ్రామానికి చెందిన టీవీసీ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రముఖ నర్సరీరైతు తాడాల విష్ణుచక్రవర్తి ఆధ్వర్యంలో సుమారు 20 వేల మొక్కలు పంపిణీ చేశారు. ఆలయ ఈవో కె.ఎస్.రామారావు, దేవాలయ ఈఈ కేవీఎస్ఆర్ కోటేశ్వరరావు, డిప్యూటీ ఈఈ రవీందర్, ఏఈలు రామకృష్ణ, భానుచందర్, చక్రవర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కడియపులంక శ్రీఅపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు భక్తులకు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

బిక్కవోలు: దుర్గాష్టమి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో జగజ్జనని దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. బలభద్రపురం శిరిడీసాయి దేవాలయంలో జరుగుతున్న శతచండీ యాగం, అష్టమి పూజలు కనులపండువగా జరిగాయి.

కోరుకొండ: బొల్లెద్దుపాలెం గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులచే సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తెదేపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి తదితర ప్రజాప్రతినిధులు, జనసేన, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రాజానగరం: దివాన్‌చెరువులోని సాదుపేటలో ఉన్న లక్ష్మీగణపతి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో 60 మంది మహిళలు తలపై కలశాలతో గురువారం ఊరేగింపు నిర్వహించారు. భవానీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గోకవరం: దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారు భక్తులకు కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కాలువ గట్టుపై ఉన్న దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద సొసైటీ మాజీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు.



బిక్కవోలులో..



గోకవరం దేవీచౌక్‌లో అమ్మవారు



బొమ్మూరు నేతాజీనగర్‌లో దుర్గాదేవి



బొల్లెద్దుపాలెంలో కుంకుమ పూజలు



దివాన్‌చెరువులో కలశాలతో ఊరేగింపు..



ఇంద్రకీలాద్రి వద్ద మొక్కల పంపిణీ



అమ్మవారి విగ్రహం వద్ద ఎమ్మెల్యే బత్తుల తదితరులు

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం శివారు సూర్యారావుపేటలో పందిట్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకట లక్ష్మి దంపతులు గురువారం పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు హాజరయ్యారు.

సీతానగరం: దసరా ఉత్సవాలు పలు దేవాలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. సీతానగరం మండలం చీపురపల్లి పంచాయతీ పరిధిలోని అచ్యుయ్యపాలెం అరవాలమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించిన కుంకుమార్చనలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సతీమణి వెంకటలక్ష్మి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

కడియం నర్సరీలలో శిక్షణా విద్యార్థులు



శివాంజనేయ నర్సరీలో విద్యార్థుల బృందం

కడియం, న్యూస్‌టుడే: 28 రాష్ట్రాలకు సంబంధించిన 18 ఎన్.సి.సి డైరెక్టరీస్ నుంచి వచ్చిన దాదాపు 300 మంది శిక్షణా విద్యార్థుల బృందం కడియం నర్సరీలను సందర్శించారు. కడియపులంకలోని శివాంజనేయ నర్సరీలో వీరికి నర్సరీ అధినేత, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు స్వాగతం పలికారు. పలు రకాల ఔషధ, వాణిజ్య మొక్కల పెంపకం, విదేశీ మొక్కల దిగుమతి వాటి పునరుత్పత్తి పద్ధతులను అధ్యయనం చేశారు. గుంటూరు రేంజ్ ఎన్.సి.సి లెఫ్టినెంట్ డాక్టర్ మంజుశ్రీ, నర్సరీ సంఘం సభ్యులు పెనుమాక కొండబాబు, గాద నాగేశ్వరరావు, బాల మురళీకృష్ణ, గట్టా కృష్ణ, రావిపాటి రామకృష్ణ, పుల్లా పెద్ద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంకర రోడ్డుకు మోక్షమెప్పుడు!



సచివాలయం-1 కు వెళ్లాలంటే గుంతల రోడ్డు, కంకర రాళ్లు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. బొమ్మూరు జీపీఆర్ రోడ్డు కొన్నేళ్లుగా మరమ్మతులు, కొత్త రోడ్డుకు నోచుకోకపోవడంతో స్థానికులకు శాపంగా మారింది. బొమ్మూరు నుంచి పాతబొమ్మూరుకు వెళ్లే వ్యాపారులు, విద్యార్థులు ఇటుగా రాకపోకలు సాగించలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై గుంతలు ఉండడంతో వాహనచోదకులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. గుంతల్లో తాత్కాలికంగా వేసిన కంకర రాళ్లు మొత్తం రోడ్డుపై చల్లాచెదురుగా దర్శనమిస్తోంది. రోడ్డు పొడవునా ఇదే పరిస్థితి. సమస్యపై కార్యదర్శి కాశీని వివరణ కోరగా ఆ ప్రాంతంలో సమస్య తెలుసుకుంటామన్నారు. రోడ్డుపై తాత్కాలిక మరమ్మతులకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, బొమ్మూరు

వ్యాన్ బోల్తాపడి ఒకరి మృతి

సీతంపేట: వ్యాన్ అదుపుతప్పి లోయలోపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అమ్మన్నరావు వివరాల ప్రకారం..తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిసలేరు గ్రామం నుంచి బీఎస్ఎన్ఎల్ టవర్ సామగ్రి తరలిస్తున్నారు. ఈక్రమంలో కోతాం సమీపంలోని ఘాట్ రోడ్డులో వాహనం బ్రేకులు విఫలమవడంతో అదుపుతప్పి 20 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సుభద్రంపేటకు చెందిన కూలి కె.సతీష్(33) మృతి చెందాడు. చోదకుడు లోవరాజు, మరోవ్యక్తి శ్రీను గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ప్రాంతీయాసుపత్రికి తరలించామని ఎస్సై అమ్మన్నరావు తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం నేర వార్తలు: ఆల్కట్‌తోట ప్రాంతానికి చెందిన ఓ బాలిక(14) ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి గురువారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని గాయాలు

హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఎం.వెంకటనాయుడు ద్విచక్ర వాహనంపై గురువారం ఆటోనగర్ జాతీయ రహదారి కూడలి దాటుతుండగా కారు ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు గాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య కిషోర్

కోరుకొండ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ శ్యాంసుందర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు, ప్రజలకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు.

బిక్కవోలు: దీపావళిని పురస్కరించుకుని అనపర్తి సీఐ సుమంత్ గురువారం మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాలు పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా! లేదని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. స్థానికులతో కలిసి కార్బన్ డై ఆక్సిజన్ యంత్రాల పనితీరును పరీక్షించారు. బిక్కవోలులోని శ్రీగోలింగేశ్వర, పందలపాకలోని శ్రీవెంకట దుర్గా ఫైర్ వర్క్స్ ప్రాంతాలను సందర్శించారు. తయారీదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎస్సై రవిచంద్ర ఆయన వెంట ఉన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం

రాజానగరం: మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామని రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ అన్నారు. గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి, ఎండీఎంఏ వంటి డ్రగ్స్‌ను నిరోధించడంలో కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఈ మేరకు కళాశాలల్లో, గ్రామాల్లోనూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందన్నారు. గంజాయి నిర్మూలన కోసం తమ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి పట్టుబడితే అది ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడకు వెళుతుంది? దాని వెనుక ఎవరున్నారో లోతుగా విచారించి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎస్సై మనోహర్ పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి గ్రామీణం: మండలంలోని కుతుకులూరులో పులగం సూర్రెడ్డి జ్ఞాపకార్థం గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏటా తన తండ్రి జ్ఞాపకార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న తిరుమల తిరుపతి వెంకటేశ్వరరెడ్డి సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని కోరారు. శిబిరంలో 263 మంది పరీక్షలు చేయించుకున్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

● దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే నల్లమిల్లి అన్నారు. రామవరంలో కూటమి నాయకులతో కలిసి టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు.

సబ్ రిజిస్ట్రార్‌కు అభినందనలు..



ఎమ్మెల్యే గోరంట్లను కలిసిన కడియం సబ్‌రిజిస్ట్రార్ ఇ.లక్ష్మి

కడియం: కడియం సబ్‌రిజిస్ట్రార్‌గా ఇ.లక్ష్మి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్లను ఆమె గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. గత పాలకుల ఆధ్వర్యంలో గ్రామీణ నియోజకవర్గంలో అనేక భూవివాదాలకు తావిచ్చిన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

ధవళేశ్వరం, టి.నగర్: శాటిలైట్‌సిటీ బీ బ్లాకులో చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. కులమతాలకు అతీతంగా ఎన్నికల సమయంలో తన వెంట నడిచిన వారందరికీ వెన్నంటే ఉంటానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బిషప్ రమేష్ కుమార్‌కి ఆర్థిక సాయం గురువారం అందజేశానని ఆయన తెలిపారు. సురేంద్ర, పిన్నింటి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టు విజేతగా కాకినాడ

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఊలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్విటేషన్ హ్యాండ్‌బాల్ టోర్నమెంటు గురువారం నిర్వహించారు. చంటి, సాయి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎనిమిది జట్లకు ఆహ్వానం అందింది. ఫైనల్‌లో కాకినాడ, ఊలపల్లి జట్లు తలపడగా కాకినాడ జట్టు విజయం సాధించింది. ద్వితీయస్థానంలో ఊలపల్లి, తృతీయస్థానంలో రాజమహేంద్రవరం నిలిచాయి. ఈ టోర్నమెంటును మండల ఉపాధ్యక్షురాలు మంగయమ్మ, ఎన్‌డీఏ నాయకులు తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. బహుమతి ప్రదానం సైతం వీరు అందించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోతులను నిర్మూలించాలని వినతి



ఎంపీడీవో గోవింద్, పంచాయతీ కార్యదర్శి శిరీషాలకు వినతిపత్రం ఇస్తున్న బోసుబాబు

గోకవరం, న్యూస్‌టుడే: కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీటి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని మాజీ జడ్పీటీసీ పాలూరి బోసుబాబు కోరారు. ఎంపీడీవో గోవింద్, గోకవరం పంచాయతీ కార్యదర్శి శిరీషాలకు ఆయన గురువారం వినతిపత్రం అందించారు. కోతుల బెడద కారణంగా రైతులు వ్యవసాయం చేయలేని దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వినతులు ఇచ్చినా చర్యలు శూన్యమన్నారు. ఇప్పటికైన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

స.హ.చట్టం వారోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కానవరం (రాజానగరం): మండలంలోని కానవరానికి చెందిన కోడి తాతారావు అలియాస్ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించే సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాల్లో భాగంగా.. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నరసింహ కిషోర్ చేతుల మీదుగా గోడపత్రికను ఆవిష్కరింప చేశారు. మనహక్కులకై పోరాడు, సాధించు ఉద్యమ సంస్థ, ఇండియన్ యాక్ట్స్ అవేర్‌నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్‌బాబు సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ద్వారా ప్రజలు, సంస్థలకు సంబంధించి ఎన్నో విలువైన అంశాలు తెలుసుకోవచ్చన్నారు. డొక్కా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ ప్రాంగణం



ఆర్టీసీ బస్టాండులో పార్కింగ్ చేసిన ప్రైవేటు వాహనాలు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం- కాకినాడ ప్రధాన రహదారిపై ధవళేశ్వరం బస్టాండు సెంటర్ వద్ద ఉన్న ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం లోనికి బస్సులు రావడంలేదు. దీంతో బస్టాండు నిరుపయోగంగా మారుతోంది. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పైనే మండుటెండలో గంటల తడబడి నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. బస్సులు ప్రయాణికులను ఎక్కించుకునేందు రహదారిపై ఆపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కాటన్ బ్యారేజీ, వేమగిరి కూడలి మీదగా రాజమహేంద్రవరం నగరంలోకి ఇటునుంచే బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ధవళేశ్వరం మేజర్ పంచాయతీ నుంచి జలవనరులశాఖ, పోలవరం ప్రాజెక్టు లాంటి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, వ్యాపార సంస్థలు, ప్రైవేటు ఉద్యోగులు వేలమంది ప్రజలు రోజూ ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు.



రహదారిపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంలా..

బస్టాండును ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఉపయోగిస్తున్నారు. గ్రామస్థులు అనేక మార్లు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా మార్పులేదు. రహదారిపై బస్సులు ఎక్కించుకోవడంతో ప్రయాణీకులు దుకాణ సముదాయాలు, చెట్లకింద, టీ, శీతల పానీయాలు విక్రయించే చిన్న దుకాణాల వద్ద నిలబడుతున్నారు. ఎండ, వానలకు ఇవే దిక్కవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండు లోపలకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ధవళేశ్వరం బస్టాండులోకి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఆర్టీసీ సిబ్బందిని బస్టాండు వద్ద నియమించాము. బస్సులు లోపలికి వచ్చి ప్రయాణీకులను ఎక్కించుకొనేలా చర్యలు చేపట్టాలని వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాము. బస్టాండు ఆవరణలో ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేయకుండా చూస్తాం.

- షబ్నం, ఆర్టీసీ డిపో మేనేజర్, రాజమహేంద్రవరం

కొవ్వూరు
●కొవ్వూరు ●నిడదవోలు ●గోపాలపురం

కమిటీలతో స్థానిక ప్రభుత్వాల పనితీరు మెరుగు


మాట్లాడుతున్న ప్రసంగిరాజు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండల పరిషత్తు కార్యాలయం(సమిశ్రగూడెం)లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు జరుగుతున్న శిక్షణ తరగతులను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా శిక్షణ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు గురువారం ఆయన పరిశీలించారు. ఫంక్షనల్ కమిటీలను ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రభుత్వాల పనితీరు మరింత మెరుగుపడుతుందని అన్నారు. మాస్టర్ ట్రైనీలు శ్రీనివాసరావు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సమాన ఆస్తిహక్కు

ఉండ్రాజవరం: మిగిలిన తోబుట్టువులతోపాటు దివ్యాంగులకు ఆస్తిలో సమానహక్కు ఉంటుందని తణుకు ప్యానల్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, ఎ.అజయ్‌కుమార్ అన్నారు. పాలంగిలోని ప్రేమాన్విత మానసిక వికలాంగుల హోమ్‌లో గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హులకు పింఛను తదితర పథకాలు అందని పక్షంలో తమ న్యాయసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఉండ్రాజవరం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈవోపీఆర్డీ కట్టమూరి ఆంజనేయ శర్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: మండలంలోని తణుకు నుంచి బెల్లం మార్కెట్ కూడలి మీదుగా గమిని పరిశ్రమకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేపట్టాలి.
– వి.వెంకట్రామరాజు, చివటం
సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – శ్రీనివాసు, ఏఈ, ర.భ.శాఖ - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

సమస్య: కొవ్వూరు మండలం తోగుమ్మిలోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపు వెడల్పు తక్కువగా ఉండడంతో వర్షం కురిస్తే మురుగు రోడ్డుపైకి చేరుతోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.
– సతీష్, తోగుమ్మి
జవాబు: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.
– యు.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, చాగల్లు, కొవ్వూరు పట్టణం

సమస్య: యర్నగూడెంలోని పశువుల ఆసుపత్రి సమీపంలోని మంచినీటి ట్యాంకును ఆనుకుని ఉన్న డ్రైనేజీ పూడుకుపోయింది. రోజులు తరబడి మురుగు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వర్షం కురిసినప్పుడు డ్రైనేజీ పొంగి మురుగు రహదారిపైకి, ఇళ్లల్లోకి చేరుతోంది. కాలువను శుభ్రపరిచి సమస్య పరిష్కరించాలి. – స్థానికులు
సమాధానం: మురుగు కాలువలో పూడిక తీయించి త్వరలో సమస్య



పరిష్కరిస్తాం.
– అమ్మిరాజు, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, దేవరపల్లి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

దుర్గామాతా.. నమోస్తుతే


కొవ్వూరులో జ్ఞానసరస్వతిగా...


తాళ్లపూడిలో కనకదుర్గాదేవిగా..


గోపవరం గుబ్బాలమ్మ అమ్మవారు


కోరుమామిడి శివారు అమ్మేపల్లిలో


వేలివెన్నులో మహంకాళమ్మ..


వద్దూరులో

కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం దుర్గాష్టమి పూజలు చేశారు. ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ★ కొవ్వూరులో అమ్మవారు జ్ఞాన సరస్వతిగా దర్శనమిచ్చారు. ★ తాళ్లపూడిలోని నవదుర్గాదేవిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. వేగేశ్వరపురం, పెద్దేవం, అన్నదేవరపేట, గజ్జరం తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు, భవానీ మాలదారులు భజనలు, పూజలు చేశారు. ★ నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ ఆలయం వద్ద కలశపూజ నిర్వహించారు. విద్యానగర్‌లోని దత్తసాయి పీఠంలో అమ్మవారు కనకదుర్గా మాత అలంకరణలో దర్శనమిచ్చారు. గోపవరం గుబ్బాలమ్మ, కోరుమామిడి రాజరాజేశ్వరీ అమ్మవార్లు ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ★ ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో మహంకాళమ్మ, ముత్యాలమ్మ, వద్దూరులో కనకదుర్గమ్మ, కె.సావరంలో ముత్యాలమ్మకు కుంకుమ పూజలు, విశేష అలంకరణ చేశారు. ★ గోపాలపురం-దొండపూడి రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో అమ్మవారిని సుమారు 60 కిలోల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు.

కోటసత్తెమ్మకు.. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ బంగారు, ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 332 మంది దంపతులు సహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు స్థానికులు పడాల రంగబాబు-అరుణ, నిడదవోలుకు చెందిన ముళ్లపూడి సోమరాజు-కాశీఅన్నపూర్ణ, ఉనకరమిల్లికి చెందిన కె.నాగమురళీకృష్ణ-వెంకటసత్యవతి దంపతులు చక్కెరపొంగలి ప్రసాదాన్ని వితరణ చేశారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,85,004ల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, చాగల్లు, కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, నిడదవోలు, ఉండ్రాజవరం, గోపాలపురం, నల్లజర్ల


గోపాలపురం ఇందిరమ్మ కాలనీలో భక్తుల పూజలు


కోటసత్తెమ్మ ఆలయంలో సహస్రనామ పూజల్లో పాల్గొన్న దంపతులు


కొవ్వూరులో వాసవి నృత్య ప్రదర్శన

14 మద్యం దుకాణాలకు 644 దరఖాస్తులు

దేవరపల్లి: దేవరపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 14 మద్యం దుకాణాలకు 644 దరఖాస్తులు అందినట్లు సీఐ బళ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 14వ తేదీన ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలో లాటరీ పద్ధతిలో దుకాణాలను ఎంపిక చేస్తామన్నారు.

భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగొస్తూ..
రోడ్డు ప్రమాదంలో దుర్మరణం


జగదీష్ (పాత చిత్రం)

నల్లజర్ల: అస్వస్థతకు గురైన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందాడు. భార్యకు గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ప్రకాశరావుపాలేనికి చెందిన జగదీష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయనకు భార్య జయలక్ష్మి, ఆరు, మూడేళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. జగదేష్ కుటుంబ సభ్యులు గురువారం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తర్వాత భార్య జయలక్ష్మి అస్వస్థతకు గురవడంతో జగదీష్ ద్విచక్ర వాహనంపై నల్లజర్లలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా నల్లజర్ల శివారులోని వంతెన వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్ ఇంజిన్‌ను అధిగమించే క్రమంలో ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. జగదీష్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, భార్య జయలక్ష్మికి గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ.శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మోహనరావు తెలిపారు.

అయ్యప్ప మాలధారులకు వసతి సదుపాయం


పీఠం వద్ద స్వాములు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: స్థానిక సొలస సత్యనారాయణ, దమయంతి కల్యాణ మండపంలో ధర్మశాస్త్ర అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప పీఠం ఏర్పాటు చేశారు. నందిని బేకరి యజమాని లకంసాని వరప్రసాద్ మిత్రబృందం ఆధ్వర్యంలో స్వాములకు అయ్యప్ప మాలలు అందజేశారు. సుమారు 200 మంది స్వాములు శబరిమల యాత్రకు వెళ్లే వరకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం అందజేయడంతోపాటు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా పీఠంలో సౌకర్యాలు కల్పించారు. స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జనసేన శ్రేణుల భోజనాలు...

దేవరపల్లి, న్యూస్‌టుడే: విజయవాడ అమ్మవారి దర్శనానికి కాలినడకన వెళుతున్న భవానీ మాలధారులకు భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమని జనసేన ఇన్‌ఛార్జి డి.సువర్ణరాజు అన్నారు. యర్నగూడెంలోని పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో గురువారం కాలినడకన విజయవాడ వెళుతున్న భవానీలకు భోజనాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, బొల్లిన విజయ్‌భాస్కర్, నాయుడు దుర్గాప్రసాద్, వర్ధినీడి నరేంద్ర, బళ్ల రాము, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న జనసేన ఇన్‌ఛార్జి సువర్ణరాజు

సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

పెరవలి, న్యూస్‌టుడే: సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అప్పారావు పేర్కొన్నారు. స్థానిక బస్‌స్టాండ్ కూడలిలో ఆయన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాట్సాప్‌లో తప్పుడు సమాచారం పెట్టిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటో అపహరణపై కేసు

పెరవలి: తన ఆటో అపహరణకు గురైనట్లు మండలంలోని కాపవరానికి చెందిన జంగా చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిని తమ గ్రామానికికే చెందిన చిత్తూరు రమేష్‌కు అద్దెకి ఇచ్చానని, అది గత నెల 29 నుంచి కనిపించడం లేదని, పరిసరాల్లో వెదికినా ఆచూకీ లభించలేదని. . ఎవరైనా అపహరించి ఉంటారని ఆ ఫిర్యాదులో చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

దేవరపల్లి, న్యూస్‌టుడే: బ్యాంక్ పని మీద వెళ్లి రహదారి దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన చక్క కాశీవిశ్వనాథం(71) రెండేళ్లుగా దేవరపల్లిలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. గురువారం ఉదయం బ్యాంక్ పని మీద మండలంలోని యర్నగూడెం వెళ్లారు. రోడ్డు దాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనగా తలకు బలమైన గాయమైంది. స్థానిక తెదేపా నేత పెన్మత్స సుబ్బరాజు అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

దేవరపల్లి: ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఆర్థిక లావాదేవీలతో మనస్తాపానికి గురై కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం సంగాయిగూడేనికి చెందిన దంపనబోయిన శివ(32) ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో కొంత కాలంగా పని చేస్తున్నారు. ఆయనకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ నెల 8న రుణాల వసూలు నిమిత్తం సంగాయిగూడెం వచ్చి తన ఇంట్లో ఆ రాత్రి నిద్రపోయారు. 9వ తేదీ తెల్లవారుజామున వాంతులు అవడంతో ఆయన తల్లి, బంధువులు హుటాహుటీన నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కలుపు నివారణ మందు తాగినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10 మృతి చెందారు. మృతుడి తల్లి పెద్దింట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆదర్శంగా కొవ్వూరు మార్కెట్ యార్డు


కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల కాలంలో మార్కెట్ యార్డు పూర్తి నిర్లక్ష్యానికి గురైందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విమర్శించారు. స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయాన్ని ఆయన కూటమి నాయకులతో కలిసి గురువారం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో మార్కెట్ కమిటీలను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో పుంత రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, రాయితీ విత్తనాలు ఇతర సేవలు అందించే అవకాశం ఉన్నా గత ప్రభుత్వ వైఫల్యంతో ఇవన్నీ రైతుకు దూరమయ్యాయన్నారు. త్వరలో కమిటీ నియామకం పూర్తి చేసి, యార్డు సేవలు విస్తృత పరిచి, కొవ్వూరు మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలోని శ్రీ బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి స్థానికులు మాధవరపు సూర్యచంద్రం-అనంతలక్ష్మీ దంపతుల కుమారుడు వెంకటేశ్వరరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగ్గురికి పిచ్చికుక్క కాట్లు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ముగ్గురిని తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని వేగేశ్వరపురంలో గురువారం వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. ఒకరికి చేతిపై, మరో ఇద్దరికి కాలుపై రక్తం కారేలా గాయపరిచింది. వారంతా తాళ్లపూడి పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు.

ఉద్యోగులకు సత్కారం

ఉండ్రాజవరం: ఇటీవల బదిలీపై వెళ్లిన ఉప తహసీల్దార్ కె.పద్మావతి, సర్వేయరు వి.నాగేంద్రబాబు, వీఆర్వోలు డి.నాగరాజు, కె.రాజశేఖర్, ఐ.శ్రీనివాసులుకు మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీడ్కోల సభ నిర్వహించారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాదు ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.

రతన్ టాటాకు చిత్ర నివాళి


కైవల్య గీసిన చిత్రం

నిడదవోలు, న్యూస్‌టుడే: దిగ్గజ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్, టాటా సన్స్ ఛైర్మన్ రతన్ టాటా మృతి దేశం మొత్తాన్ని శోకసంద్రంలో ముంచింది. దేశ సేవలో ప్రస్తుత, రాబోవు తరాలకు ఆదర్శంగా నిలిచిన రతన్ టాటాకు నివాళి అర్పిస్తూ నిడదవోలుకు చెందిన కైవల్య గీసిన చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న నల్లజర్లకు చెందిన షేక్ బేగం బీబీకి మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. సంఘ అధ్యక్షురాలు ఝాన్సీరాణి, గుళ్లపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఐ.డి.వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నాట్లు ప్రారంభం


గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం నియోజకవర్గ పరిధిలో వర్జీనియా పొగాకు నాట్లు పనులు ప్రారంభమయ్యాయి. అయిదు రోజుల కిందటి వరకు ముహూర్తం కోసం రైతులు ఎదురు చూశారు. తీరా ముహూర్తం కుదిరిందనుకుంటే నిత్యం వర్షం పడుతోంది. దీంతో నాట్లు కొంచెం మందకొడిగా సాగుతున్నాయి.

చివరిలో ఎండాకు తెగులు
●దిగుబడిపై తీవ్ర ప్రభావం ●ఆందోళనలో అన్నదాతలు

ప్రస్తుత సార్వా సీజన్లో ఆది నుంచి భారీ వర్షాలు ముంచెత్తాయి. కుండపోత వర్షానికి కాలువలు ఉప్పొంగడంతో కొన్ని చోట్ల వరి చేలు ముంపు బారినపడ్డాయి. ఎలాగో సీజన్ నెట్టుకొచ్చారు. అయితే చివరిలో వీచిన ఈదురుగాలులు, వర్షం, ప్రస్తుతం ఉక్కబోత, ఎండతీవ్రత తదితర వాతావరణ మార్పులు కారణంగా వరిని ఎండాకు తెగులు ఆశిస్తోంది. పచ్చని చేలు తెగులు సోకి ఎండిపోతున్నట్లు కనిపించడంతో కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు తెగులు తీవ్రతరం అవుతోంది. ఇదే అదునుగా దుకాణదారులు రకరకాల మందులను రైతులకు అంటగడుతున్నారు. వాటిని పిచికారీ చేసినా ఫలితం ఉండటం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

ఖరీఫ్‌లో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో సుమారు 36 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం స్వల్పకాలిక రకాలు ఈనిక, దీర్ఘకాలిక రకాలు పొట్ట దశలో ఉన్నాయి. ఈ నెలలో కురిసిన వర్షాలకు వరిచేలు ఏపుగా పెరిగి కళకళలాడాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఒకే సారి ఎండతీవ్రత, ఉక్కబోత తదితర వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకే సారి భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో పైరుపై ఎండాకు తెగులు సోకుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. స్వల్పకాలిక రకాలు ఈనిక దశ పూర్తయింది. దీర్ఘకాలిక రకాలు చిరుపొట్టదశలో ఉన్నాయి. ఈ దశలో చేను పచ్చగా ఉంటే


ఎండిన ఆకుల మధ్య తాలుగా మారిన గింజలు

ఆశించిన దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒక్కొక్క ప్రాంతంలో ఈ ఎండాకు తెగులు రావడంతో ఎకరానికి పది బస్తాల దిగుబడి తగ్గే అవకాశముందని గగ్గోలు పెడుతున్నారు.

ఖర్చు అధికమే..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి భారీ వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాల్లోని వరినాట్లు నీటమునిగాయి. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలోని కొవ్వాడ, ఎర్ర కాలువ ఉద్ధృతికి వరినాట్లు ముంపున బారిన పడ్డాయి. రెండు మూడుసార్లు నాట్లు వేసి ఎరువులు, సస్యరక్షణ మందులు పిచికారీ చేశారు. ప్రస్తుతం ఎండా తెగులు సోకడంతో రైతులు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. పచ్చని చేను రోజురోజూకు ఎండిపోతున్నట్లు కనిపించడంతో పలు రకాల మందులు పిచికారీ చేసేందుకు పురుగు మందుల దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా దుకాణదారులు రకరకాల మందులను అంటగడుతున్నారు. ప్రస్తుత సార్వాలో పెట్టుబడి ఖర్చు అధికమేని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కూటమీ ప్రభుత్వం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎండాకు తెగులుపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పలు సూచనలు, సలహాలను అందిస్తున్నారు.

సోకడానికి కారణాలివే..

● ఈదురుగాలులు, వర్షం, మంచు తదితర వాటితో వాతావరణ మార్పులు చోటు చేసుకోవడం
● మిశ్రమ ఎరువుల ధరలు పెరగడంతో అధిక మోతాదులో యూరియా వాడటం
● నీరు ఒక పంట పొలం నుంచి మరొక చోటికి వెళ్లడం
● కిందటేడాది పంటలో ఉన్న ఈ తెగులు ప్రస్తుత పంటకు సోకడం

గింజ కట్టకుండానే..

ఈ నెలలో వీచిన ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా వరిపై ఎండాకు తెగులు సోకింది. నాకున్న 10 ఎకరాల్లో 3.5 ఎకరాల్లో గోల్డ్ స్వర్ణ, మిగిలిన 6.5 ఎకరాల్లో 1318, పీఎల్‌ఏ రకాలను సాగు చేశా. గోల్డ్ స్వర్ణ రకం దూరంగా, దగ్గరగా చూసినా ఎండిపోయినట్లు కనిపిస్తోంది. గింజ కట్టకుండానే వరిపైరు ఎండిపోయింది. దిగుబడిపై ప్రభావం చూపిస్తోంది. ఎకరానికి 8 నుంచి పది బస్తాల దిగుబడి తగ్గే అవకాశముంది. -టి.శ్రీనివాసు, కౌలు రైతు

వాతావరణ మార్పులతోనే..

వాతావరణ మార్పుతోనే ఈ తెగులు సోకుతుంది. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వచ్చి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వాటిని పాటిస్తే తెగులు తీవ్రత తగ్గే అవకాశముంది. వ్యవసాయాధికారుల సిఫార్సు మేరకే సస్యరక్షణ చేపట్టాలి.
-చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు